# ఇబ్బంది

కిరాతకుడిలా పదిన్నరకే మండిపోతున్న ఎండమీద చిరాకుపడ్డాడు రామకృష్ణ. ప్రక్కనే నిలబడివున్న అందమైన యువతి అతనికి ఆనందాన్ని కలిగించడంలేదు. మరింత ఇబ్బంది పెడుతోంది. ఆడవాళ్ళు కూడా ఉద్యోగాలు సంపాదించి, అలా ఆనందంగా తిరుగుతుంటే, ఇంకా ఉద్యోగాల వేటలోవున్న తనమీద తనకే చిరాకువేస్తోందతనికి. అందుకే ఇబ్బందిగా నిలబడి, 'బస్సు ఎంత త్వరగా వస్తుందా, తనని ఇంటర్వ్యూ జరిగే ఆఫీసు దగ్గరకు ఎంత త్వరగా చేరుస్తుందా' అని ఆత్రుతపడ సాగాడు.

బస్‌కోసం ఎదురుచూస్తున్న రుక్మిణికింతకన్నా ఎక్కువ ఇబ్బందిగా వుంది, అక్కడ నిలబడడం! సీతదీ తన వయసే! అయినా ఆమెకీ తనకీ ఎంత తేడా?! ప్రొద్దునే తనిలా ఉద్యోగంకోసం పరుగెడుతుంటే, ఆమె అందంగా అలంకరించుకుని, అంతకన్నా ఆనందంగా భర్తతో బయల్దేరిందెక్కడికో!!! ప్రక్కనే నిలబడున్న సీతని చూడలేక సతమతమవుతూ నేలచూపులు చూడసాగింది రుక్మిణి.

భర్తకి అంత సన్నిహితంగా దాదాపు తాకుతున్నట్లుగా అలా నిలబడడం ఇబ్బందిగా వుంది సీతకి. 'పెళ్ళయి మూడు నెలలు కూడా కాలేదు; అందుకే భర్త దగ్గర ఇంకా పూర్తి చనువు ఏర్పడలేదు—తన మనసు విప్పి చెప్పడానికి. తామిద్దర్నీ అందరూ వింతగా చూస్తున్నారేమో!' నెమ్మదిగా తలెత్తి చుట్టూ చూడసాగింది.

ఆమెకి కొద్దిగా ఇవతలగా నిలబడ్డ రాజారావుని ఆ క్రొత్త దంపతుల ఉనికి మరింతగా బాధించసాగింది. అసలే పండక్కి క్రొత్త చీర కొనివ్వలేదని చిర్రుబుర్రులాడుతున్న తనభార్య వీళ్లని చూసిందంటే మరింకే కోరికలతో వేధిస్తుందో! వళ్ళంతా కళ్ళు చేసుకుని వాళ్ళనే గమనిస్తున్న భార్య ప్రవర్తన అతడిని తెగ ఇబ్బంది పెట్టేస్తోంది.

ఆ ఇబ్బందితో అటు ఇటు బిత్తరచూపులు చూస్తున్న రాజారావు చూపులకు రామకృష్ణ అయస్కాంతంలా తగిలాడు. 'పెళ్ళికాని ఇతను ఎంత అదృష్టవంతుడో కదా!' అనుకున్నాడు, ఇబ్బందివల్ల కలిగిన బాధని మరచి.

(స్వాతి సపరివారపత్రిక)